1,947కే విమాన టికెట్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రీడం సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,947గా నిర్ణయించింది. ఈ నెల 5 లోపు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 30లోగా ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొంది.

లాభాల్లో మెడ్‌ప్లస్

హైదరాబాద్, ఆగస్టు 2: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ విక్రయ సంస్థ మెడ్‌ప్లస్ హెల్త్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.14.36 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 16 శాతం ఎగబాకి రూ.1,489 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది.

ఇంటింటా ఇన్వెంటర్ గడువు పొడిగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఇంటింటా ఇన్వెంటర్-2024కు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రకటించింది. ఆవిష్కర్తలు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 10 వరకు అవకాశం ఉందని పేర్కొంది. ఆవిష్కరణలను 9100678543 వాట్సప్ నంబర్‌కు పంపించాలని సూచించారు.

6న ఏఐపై వర్క్‌షాపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో కలిసి ఈ నెల 6న వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు టీ హబ్ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వాడుకలోకి వచ్చిన ఏఐ టూల్స్ తరహాలో పరిశ్రమల అవసరాల కోసం ఉత్పాదక (జనరేటివ్)ఏఐపై ఆవిష్కర్తలు, స్టార్టప్ నిర్వాహకులు సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యూఎస్) సహకారంతో ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు టీ హబ్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని టీ హబ్ ప్రతినిధి తెలిపారు.

4.5 లక్షల కోట్లు ఔట్

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఒక్కరోజే భారీగా ఆవిరైన సంపద

రికార్డు గరిష్ఠాల నుంచి సూచీలు వెనుకకు • సెన్సెక్స్ 886, నిఫ్టీ 293 పాయింట్లు పతనం



ముంబై, ఆగస్టు 2: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్ పడింది. శుక్రవారం మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా నమోదు కావడం అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లకు రుచించలేదు. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడింది. ఆల్‌టైమ్ హైల్లో సూచీలు ఉండటం తోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణకు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే భారీ నష్టాలు వాటిల్లాయి. ఫలితంగా 5 రోజుల లాభాలకు తెరపడినట్టైంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 885.60 పాయింట్లు లేదా 1.08 శాతం క్షీణించి 80,981.95 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 998.64 పాయింట్లు పడిపోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 293.20 పాయింట్లు లేదా 1.17 శాతం పతనమై 24,717.70 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలోనైతే గరిష్ఠంగా 324.05 పాయింట్లు నష్టపోయింది.

రంగాలవారీగా..

రియల్టీ షేర్లు అత్యధికంగా 3.56 శాతం నష్టపోయాయి. మెటల్ 3 శాతం, ఆటో 2.97 శాతం, ఐటీ 2.05 శాతం, కమోడిటీస్ 1.83 శాతం, టెక్నాలజీ 1.79 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.70 శాతం చొప్పున క్షీణించాయి. ఇక మారుతీ సుజుకీ, టాటా మోటర్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేక నష్టాలను మూటగట్టుకున్నాయి. జూలైలో పడిపోయిన వాహన విక్రయాలతో ఆటో కంపెనీల షేర్లు, ఇన్ఫోసిస్‌కు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నోటీసుల కలకలంతో ఐటీ సంస్థల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.58 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులను పరిశీలిస్తే.. ప్రధాన ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఐరోపాలోని కీలక దేశాల స్టాక్ మార్కెట్ల పరిస్థితీ ఇలాగే ఉన్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నలా భావించే అమెరికాలో మరోమారు ఆర్థిక మాంద్యం ఛాయలు అలుముకుంటున్నాయా? అన్న అంచనాల నడుమ మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఈ పరిణామం భారత్‌సహా అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్లను కుదిపేసినట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. జూలైలో ఐఎస్ఎం తయారీ సూచీ 46.6కు దిగజారింది. దీంతో మాంద్యం భయాలు మళ్లీ నెలకొన్నాయని అంటున్నారు. అలాగే ఇజ్రాయెల్-హమాస్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలూ నష్టాలకు దారితీశాయని వారు చెప్తున్నారు.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాల నడుమ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో కరిగిపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,46,003.7 కోట్లు తగ్గి రూ.4,57,16,946.13 కోట్ల (5.46 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 1.08 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం, స్మాల్‌క్యాప్ 0.58 శాతం చొప్పున పడిపోయాయి. ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో కదలాడగా.. సమయం గడుస్తున్నకొద్దీ మరింత తీవ్రంగా నేలచూపులు చూశాయి.

మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహీంద్రా గ్రూపు పెట్టుబడులపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆనంద్ మహీంద్రా అంగీకరించారు.

అమెరికాను భారత్ అందుకోలేదు

- **నాల్గోవంతు తలసరి ఆదాయాన్ని చేరాలన్నా 75 ఏండ్లు పట్టొచ్చు**
- **ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక**

న్యూఢిల్లీ, ఆగస్టు 2: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకే చోదక శక్తి, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధిరేటును సాధిస్తున్న దేశం అంటూ భారత్‌ను కీర్తిస్తున్న వేళ.. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఓ నివేదిక అందులో నిజమెంత? అన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. రాబోయే కొన్ని దశాబ్దాల్లో భారత్‌సహా 100కుపైగా దేశాలు.. అధిక ఆదాయ దేశాలుగా ఎదిగేందుకు ఎన్నో తీవ్ర అడ్డంకులను ఎదుర్కోవాల్సి రావచ్చని వరల్డ్ బ్యాంక్ హెచ్చరించింది. ఈ క్రమంలోనే అమెరికా తలసరి ఆదాయంలో ఒక్క త్రైమాసికానికి సమానమైన ఆదాయాన్ని చేరాలన్నా.. భారత్‌కు దాదాపు 75 ఏండ్లు పట్టవచ్చని అంచనా వేసింది. ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ప్రపంచ అభివృద్ధి నివేదిక 2024: ది మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్ పేరిట తెచ్చిన రిపోర్టులో అమెరికా తలసరి ఆదాయంలో నాల్గోవంతును చేరడానికి చైనా కైతే 10 ఏండ్లు పడుతుందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. ఇండోనేషియాకు 70 ఏండ్లు పట్టవచ్చున్నది.

కటిక దారిద్ర్యం

గత ఏడాది చివరికల్లా భారత్‌సహా 108 దేశాలను మిడిల్ ఇన్‌కమ్ దేశాలుగా వర్గీకరించారు. ఒక్కోదాని వార్షిక జీడీపీ తలసరి ఆదాయం 1,136 డాలర్ల నుంచి 13,845 డాలర్ల మధ్య ఉన్నది. ఈ దేశాల్లో 600 కోట్ల జనాభా ఉండగా.. ఇది ప్రపంచ జనాభాలో 75 శాతానికి సమానం. అలాగే ఈ దేశాల్లో ప్రతీ ముగ్గురిలో ఇద్దరు కటిక దారిద్ర్యంలో మగ్గిపోతుండటం గమనార్హం. ఇదిలావుంటే 1990 నుంచి ఇప్పటిదాకా కేవలం 34 దేశాలే మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థల నుంచి అధిక ఆదాయ ఆర్థిక వ్యవస్థలకు ఎదిగాయని ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రధాన ఆర్థికవేత్త గిల్ తెలిపారు.

రికార్డుస్థాయికి ఐటీ రిటర్నులు

7.28 కోట్ల మంది దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారు. 2024-25 అసెస్‌మెంట్ ఏడాదికిగాను 7.28 కోట్ల మంది రిటర్నులు దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ తాజాగా వెల్లడించింది. 2023-24 ఏడాది దాఖలు చేసిన 6.77 కోట్ల కంటే వీరి సంఖ్య 7.5 శాతం అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు జూలై 31 చివరి రోజు 70 లక్షల మంది దాఖలు చేసినట్లు తెలిపింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసిన 7.28 కోట్ల మందిలో నూతన పన్ను విధానాన్ని ఎంచుకున్నవారు 5.27 కోట్ల మంది కాగా, పాత పన్నుల విధానాన్ని కొనసాగించిన వారు 2.01 కోట్ల మంది. పన్ను చెల్లింపుదారుల ప్రాధాన్యతలు అంతకంతకు పెరుగుతున్నాయి. . ఈసారి దాఖలు చేసిన వారిలో 72 శాతం మంది ఈ పన్ను విధానాన్ని ఎంచుకోగా, 28 శాతం మంది పాత పన్నుల విధానంలోనే దాఖలు చేశారు. అలాగే కొత్తగా దాఖలు చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నట్లు పేర్కొంది. దాఖలు చేసిన వారిలో ఐటీఆర్-1 కింద 45.77 శాతం(3.34 కోట్లు), ఐటీఆర్-2 కింద 14.93 శాతం(1.09 కోట్లు), ఐటీఆర్-3 కింద 12.5 శాతం(91.10 లక్షలు), ఐటీఆర్-4 కింద 25.77 శాతం(1.88 కోట్లు), ఐటీఆర్-5 నుంచి ఐటీఆర్-7 కింద 1.03 శాతం(7.48లక్షలు) కేటగిరిల కింద దాఖలు చేశారు. వీరిలో 43.82 శాతం మంది ఆన్‌లైన్‌లో ఐటీఆర్ దాఖలు చేయగా, మిగతావారు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

పన్ను ఎగవేతలు కూడా..

పన్ను చెల్లింపుదారులు పెరిగినట్లే పన్ను ఎగవేతదారులు కూడా రికార్డు స్థాయిలో పెరుగుతున్నారు. గడిచిన పదేండ్లకాలంలో పన్ను ఎగవేతదారులు వెయ్యి రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.9.08 లక్షల కోట్ల పన్ను చెల్లింపులకు సంబంధించి నోటీసులు జారీ అయ్యాయి. 2013014 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.80 వేల కోట్లుగా ఉన్నది.

టార్గెట్ 'ఇన్ఫోసిస్' మూర్తి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ కంపెనీ రూ. 32,403 కోట్ల జీఎస్టీ ఎగవేతకు సంబంధించి కర్ణాటక స్టేట్ జీఎస్టీ అధికారులు ముందస్తు షోకాజ్ నోటీసులు పంపడంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు వారంలో 70 గంటలు పనిచేయాలన్న నారాయణ మూర్తి కామెంట్లను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఇన్ఫోసిస్ జరిమానా కట్టడానికి ఎక్కువ గంటలు పనిచేయాల్సిందేనని పోస్టులు పెడుతున్నారు. కాగా ఎగవేతకు సంబంధించిన నోటీసులను వెనక్కి తీసుకొంటున్నట్టు జీఎస్టీ అధికారులు తాజాగా వెల్లడించడం గమనార్హం.

జియోథర్మల్ క్షేత్రంగా మణుగూరు!

అన్వేషణ, అభివృద్ధిపై త్రైపాక్షిక ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): భూతాపం ఆధారంగా విద్యుదుత్పత్తికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరును జియోథర్మల్ క్షేత్రంగా అభివృద్ధి చేయనున్నారు. అక్కడ 122 మోగావాట్ల జియోథర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మూడు సంస్థలు సిద్ధమవుతున్నాయి. మణుగూరు సమీపంలోని పగిడేరు వద్ద ఏర్పాటు చేయడానికి శుక్రవారం సింగరేణి, ఓఎన్‌జీసీ, తెలంగాణ రెడ్కోల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. దీనికి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుష్మారావత్, రెడ్కో జీఎం సత్య వరప్రసాద్‌లు హాజరయ్యారు. ఇప్పటికే 20 కిలోవాట్ల విద్యుదుత్పత్తికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమవ్వగా, 122 మెగావాట్లకు వీలుందని ఓఎన్‌జీసీ నివేదిక వెల్లడించింది. మరికొన్ని పరిశోధనల్లో 3,500 మోగావాట్ల వరకు జియోథర్మల్ విద్యుదుత్పత్తికి అవకాశమున్నట్లుగా తేలింది.

రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి..

రోజుకు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు.

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయంలో హైలెవల్ బ్రిడ్జి కింది వరకు వచ్చిన నీళ్లు

ఎస్సారార్ @ 12 టీఎంసీలు

నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో కొనసాగుతున్న ఎత్తిపోతలు

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 2 : కాళేశ్వరం లింక్-2లో గత నెల 27 నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలతో శ్రీరాజరాజేశ్వర జలాశయం(మధ్యమానేరు)లో నీరు సగానికి చేరువైంది. 27.54 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 12.326 టీఎంసీలు నిల్వ ఉన్నది. 14,440 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది. కాగా, ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్‌హౌస్ నుంచి శుక్రవారం 4 మోటర్ల (2, 3, 5, 7) ద్వారా నీటి ఎత్తిపోతలను కొనసాగించారు. ఒక్కో మోటర్‌తో 3,150 క్యూసెక్కుల చొప్పున 12,600 క్యూసెక్కుల నీటిని డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఈ రిజర్వాయర్‌కు 10 గేట్లను ఎత్తడంతో గ్రావిటీ కాల్వ ద్వారా జంట సొరంగాల నుంచి అంతే పరిమాణంలో రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలుతున్నాయి. ఇక్కడి నాలుగు (1, 3, 4, 5) బాహుబలి మోటర్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడ్డ జలాలు సుమారు 5.7 కిలోమీటర్లు ఉన్న గ్రావిటీ కాలువ ద్వారా ప్రవహించి వరదకాలువలో 99వ కిలోమీటర్ మైలురాయి వద్ద కలుస్తున్నాయి. అక్కడి నుంచి మధ్యమానేరుకు పరుగెడుతున్నాయి. శుక్రవారం వరకు 7.58 టీఎంసీల గోదారి జలాలను మధ్యమానేరుకు తరలించినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కాగా, నీటి ఎత్తిపోతల ప్రక్రియను నీటి పారుదల శాఖ ఈఈ నూనె శ్రీధర్, డీఈఈ గునిగంటి నర్సింగరావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఓపీ కోసం క్యూలో ఉన్న రోగులు

రక్త నమూనాల కోసం వేచిఉన్న రోగులు

ప్రభుత్వ దవాఖాన కిటకిట

- **జ్వర పీడితులతో కిక్కిరిసిన కరీంనగర్ హాస్పిటల్**

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 2 : విషజ్వరాలు ఎక్కువ కావడంతో కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన రోగులతో కిక్కిరిసిపోతున్నది. రోజుకు సాధారణంగా 600 మందికి పైగా ఔట్ రోగులు వస్తుండగా, గత వారం రోజుల నుంచి వెయ్యి మందికి పైగా వస్తున్నారు. అందులో 80 శాతం మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్న వారే కాగా, ఓపీ, డిస్పెన్సరీ, ల్యాబ్‌ల వద్ద గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. మరోవైపు ఇన్ పేషెంట్లు కూడా ఎక్కువగా మంది ఉంటున్నారు. అయితే, రోగులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో మందులు, సౌకర్యాలు కల్పించడం లేదని రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. డాక్టర్ ఐదు రకాల మందులు రాస్తే కేవలం రెండు, మూడే ఇచ్చి మిగితావి ఇక్కడ లేవని చెబుతున్నారని వాపోతున్నారు. ఏ ఇతర రక్తా సమస్యలతో వచ్చినా రెఫర్ అంటూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన మెరుగు రాజు బైక్‌పై నుంచి పడిపోగా గాయాలతో దావఖానకు వస్తే ఇక్కడ స్కానింగ్‌తోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యం లేదని వరంగల్‌కు పంపారని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ ఆరోపించారు. ఇలాంటి ఘటనలు దవాఖానలో రోజూ చాలా జరుగుతున్నాయని వాపోయారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

మందుల కోసం క్యూలో ఉన్న రోగులు

చిన్నారి చికిత్సకు పెద్ద సాయం

- **స్పందించిన సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**
- **గర్జనపల్లిలో ఇంటికి వెళ్లి పరామర్శ**
- **చికిత్స నిమిత్తం ₹10లక్షల చెక్కు అందజేత**

వీర్నపల్లి, ఆగస్టు 2 : గర్జనపల్లికి చెందిన గజ్జెల శ్యామల, దీలీప్ దంపతుల కూతురు నయనశ్రీ (6) క్యాన్సర్ బారిన పడింది. వైద్య సాయం కోసం ఎదురుచూస్తున్నది. ఈ విషయం తెలుసుకొని సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వెంటనే స్పందించారు. శుక్రవారం చిన్నారి ఇంటికి వెళ్లి పరామర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అంతకుముందు చేయించిన చికిత్స వివరాలు అడిగి తెలుసుకొని, రిపోర్ట్‌లను పరిశీలించారు. అధైర్యపడొద్దని, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తక్షణమే వీర్నపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్, చిన్నారి తల్లి పేరిట జాయింట్ అకౌంట్ తీయాలని, ₹10లక్షలు జమ చేస్తామని తెలిపారు. ఎలాంటి సాయం అవసరమున్న నేరుగా తనకు ఫోన్ చేయాలని నెంబర్ ఇచ్చారు. వైద్య చికిత్సకు అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. చిన్నారికి మెరుగైన వైద్యం ఎక్కడ అందించాలనే అంశాన్ని పరిశీలించి, నివేదిక అందించాలని అక్కడి నుంచే డీఎం హెచ్ వసంత్‌రావువోను ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాలతో డీఎంహెచ్‌వో అక్కడికి వచ్చి చిన్నారిని పరీక్షించారు. సాయంత్రం చిన్నారి తల్లి శ్యామలకు ₹10లక్షల చెక్కును ఇన్‌చార్జీ తహసీల్దార్ మారుతీరెడ్డి అందించారు.

చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కొత్తపల్లి, ఆగస్టు 2 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 4న నిర్వహిస్తున్నామని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) అధ్యక్ష కార్యదర్శులు వీ ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, సొంత కిట్, యూనిఫాంతో కేడీసీఏ మైదానంలో ఉదయం 7 గంటలకు హాజరుకావాలని సూచించారు. 2008 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

నాలుగేళ్లకు తల్లిదండ్రుల చెంతకు..

- **కొడుకుని చూసి ఉద్వేగం**
- **ఔదార్యం చూపిన కౌన్సిలర్**

కోరుట్ల బస్టాండులో తమ కుమారుడిని చూసిన ఆనందంలో తల్లిదండ్రులు

కోరుట్ల, ఆగస్టు 2: మతిస్థిమితం కోల్పోయిన కోరుట్ల పట్టణానికి చెందిన యువకుడు నాలుగేళ్ల తర్వాత సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేరాడు. చాలా రోజుల తర్వాత కొడుకు తిరిగి రావడంతో వారు ఉద్వేగానికి లోనయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణంలోని తిలక్ రోడ్డు కాలనీకి చెందిన కటుకం రమేశ్ మతిస్థిమితం కోల్పోయి నాలుగేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణానికి చేరుకున్నాడు. అక్కడ దొరికినది తింటూ మాసిన బట్టలతో వీధుల్లో తిరిగాడు.అతడి దీనస్థితిని గమనించిన విశాఖలోని మమత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చేరదీసి బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. రమేశ్‌కు సపర్యలు చేసి మానసిక వైద్యం అందించారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ రమేశ్ తల్లిదండ్రులకు తెలిపాడు. అతడి కుటుంబసభ్యుల ఆర్థిక పరిస్థితిని గమనించిన కౌన్సిలర్ వారికి సహాయం చేసేందుకు ముందుకు వచ్చాడు. విశాఖపట్టణం వెళ్లి అక్కడి పోలీస్ అధికారులు, ట్రస్టీ ప్రతినిధులతో మాట్లాడి రమేశ్‌ను కోరుట్లకు తీసుకువచ్చాడు. స్థానిక పోలీసుల సమక్షంలో రమేశ్‌ను తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

కాశయపల్లిలో రోడ్డు పై నాట్లు వేస్తున్న గ్రామస్తులు

రోడ్డుపై వరినాట్లు

వేములవాడ రూరల్, ఆగస్టు 2: వేములవాడ మున్సిపల్ పరిధిలోని కాశయపల్లి నుంచి కోనాయపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. చినుకు పడితే చాలు దాదాపు కిలోమీటర్ మేర బురదమయంగా తయారవుతున్నది. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం ఇలా రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.